


కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని నాయన్‌హళ్లి, జిగనల్ పోస్టుకు చెందిన అర్గా బందోపాధ్యాయ కుటుంబ సభ్యుడి విషాద వదనం







ఆదిశేషగిరి రావు కుమార్తె, కుటుంబ సభ్యులు రోదన

శరవేగంగా..

- ఒక్కరోజుల్లోనే 19 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు
- వెంటనే బంధువులకు మృతదేహాల అప్పగింత
- మృతదేహాలను సొంత ప్రాంతాలకు చేర్చిన ప్రభుత్వం
- కలెక్టర్, ఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణ
- ఫోరెన్సిక్ వైద్యుల చొరవపై అభినందనలు



మార్చురీ హాల్ నుంచి మేఘనాథ్ మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది



మార్చురీ గది నుంచి మృతదేహం తరలింపు



మార్చురీ వద్ద ఎస్పీ విక్రాంత్, పోలీసులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు ప్రమాద దుర్ఘటన తర్వాత కూటమి ప్రభుత్వం శరవేగంగా స్పందించింది. అసాధారణ స్థాయిలో డీఎన్ఏ పరీక్షలు చాలా వేగంగా పూర్తిచేసి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించింది. బస్సు దహనం అయిన తర్వాత 19 మంది సజీవ దహనం కావడం, అందులో మృతదేహాలు మాంసపు ముద్దలుగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలంలోనే తాత్కాలిక మార్చురీ ఏర్పాటుచేశారు. ఫోరెన్సిక్ విభాగపు హెచ్‌వోడీ డా.సాయి సుధీర్, సీనియర్ ప్రొఫెసర్ డా.బ్రహ్మాజీ మాస్టర్‌తో పాటు 14 మంది వైద్యులు, పీజీ బృందం మృతదేహాల నుంచి డీఎన్ఏ శాంపిల్స్ సేకరించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మంగళగిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించారు. శనివారం బంధువుల దగ్గర డీఎన్ఏ శాంపిల్స్‌ను పళ్లు, ఎముక, కండరాల నుంచి సేకరించి ల్యాబ్‌కు పంపించారు. శనివారం ఉదయం 10 గంటలకు మంగళగిరికి శాంపిల్స్‌లు చేరగా ఆదివారం ఉదయం 7గంటలకే నివేదికలు ఫ్యాక్స్‌లో చేరారు. 19మంది మృతుల్లో 18 మంది పేర్లు మాత్రమే గుర్తించడంతో వారి బంధువులకు సమాచారమిచ్చి కర్నూలుకు రప్పించారు. హైదరాబాదులో తమ బంధువు రిజర్వేషన్ లేకుండా కావేరి బస్సులో రిజర్వేషన్ లేకుండా ఎక్కిన ప్రయాణికుడు ఆచూకీ, అప్పగింత కష్టంగా మారడంతో చిత్తూరు జిల్లా యమగనిపల్లెకు చెందిన త్రిమూర్తులుగా అతని మృతదేహాన్ని అప్పగించాలని బంధువులు కోరారు. త్రిమూర్తులు హైదరాబాదులోని ఇంటికి చేరకపోవడంతో పోలీసులు 19వ మృతదేహం త్రిమూర్తులదే అన్న అనుమానంతో ఆదివారం ఉదయం మంగళగిరిలో ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్‌కు శాంపిల్స్‌ను పంపి సాయంత్రం 6గంటల లోపు డీఎన్ఏ రిపోర్టులు రావడం 19వ మృతదేహం త్రిమూర్తులదేనని నిర్ధారించారు. బంధువులకు అప్పగించారు.

మిగతా 7వ పేజీలో



మధ్యాహ్నం 1:45 : గోళ్ల రమేశ్, భార్య అనుషా, పిల్లలు మాన్విత, శశాంక్‌ల మృతదేహాల తరలింపు



మధ్యాహ్నం 1:50 : యువన్ శంకర్‌రాజు మృతదేహం తరలింపు



మధ్యాహ్నం 1:55 ఆదిశేషగిరి రావు..



మధ్యాహ్నం 2:00 గన్నమనేని ధాత్రి



మధ్యాహ్నం 2:10 అమ్రిత కుమార్



మధ్యాహ్నం 2:30 బందోపాధ్యాయ



మధ్యాహ్నం 4:20 మేఘనాథ్



మధ్యాహ్నం 5:30 మంగ సంధ్య, చందన



మధ్యాహ్నం 5:50 అనూష

29న సామూహిక గృహ ప్రవేశాలు



హౌసింగ్ పీడీ హరగోపాల్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఈనెల 29న సామూహిక గృహప్రవేశాలు నిర్వహిస్తామని గృహ నిర్మాణ శాఖ పీడీ హరగోపాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నమయ్యజిల్లాలో సామూహిక గృహప్రవేశాలు (పీఎంఏవై ఎన్టీఆర్ నగర్) ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4,153 ఇళ్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశాలు చేస్తారని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నూతన గృహాలకు లబ్ధిదారులు తోరణాలు, పసుపు ఏర్పాట్లు చేసేలా చూడాలన్నారు. గృహప్రవేశాలకు నంద్యాల జిల్లాకు చెందిన మంత్రులను ఆహ్వానించాలన్నారు. అంతేకాకుండా ప్రధానమంత్రి ఆవాస్ యోజన స్కీమ్ గృహాల మంజూరు కోసం లబ్ధిదారులు వచ్చేనెల 5వతేదీలోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేయుంచుకోవాలన్నారు. ఈ గృహాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.20 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు, స్వచ్ఛ భారత్ కింద రూ.12వేలు లబ్ధిదారులకు వస్తాయన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నంద్యాల,పాణ్యం, ఆళ్లగడ్డ డివిజన్లకు చెందిన డీఈ విజయ్‌బాబు పాల్గొన్నారు.

టీజీపీ కాల్వకు గండి పడలేదు

- ఎస్ఈ ప్రతాప్



అధికారులతో చర్చిస్తున్న ఎస్ఈ ప్రతాప్

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామ సమీపంలో 84 కి.మీ సమీపంలో ప్రధాన కాలువ కుంగి పడిందన్న విషయం తెలుసుకున్న టీజీపీ(తెలుగు గంగ ప్రాజెక్టు) కాలువను ఎస్ఈ ప్రతాప్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీజీపీ ప్రధాన కాల్వకు గండి పడలేదన్నారు. అండర్ టర్నల్ వద్ద లీకేజీ అవుతుందన్నారు. ఐదు క్యూసెక్కుల నీరు మాత్రమే బోర్‌వెల్ ద్వారా బయటకు పోయేలా ఏర్పాటుచేశామన్నారు. మరమ్మతుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షపు నీరు లోపలికి ప్రవేశించకుండా నాలుగు అడుగుల కింద బోర్‌వెల్ ఉంటాయని అన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 16 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. టీజీపీ కాలువలో 5వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అన్నారు. ఆయన వెంట టీజీపీ ఈఈలు మురళీకృష్ణ, శివశంకర్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరప్రసాద్, డీఈలు వెంకటరమణ, రత్నరాజు, గురుమూర్తి, జేఈలు వినయ్, మోహన్, కృష్ణారెడ్డి, డీసీసీ చైర్మన్ శజ్జారెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, గోపాల్, వీఆర్వో చంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తాం

- నేర రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం
- ఎస్పీ సునీల్ షెరాన్



సరియైన పత్రాలు లేని బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతకు భరోసాను కల్పిస్తామని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఆదివారం తెల్లవారుజామున నంద్యాలలో ఆరు స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అనుమానిత ప్రాంతాలు, వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. సరియైన పత్రాలు లేని 24 బైకులు, 111 క్వార్టర్ బాటిళ్లు, 8 బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల తాలుకా, అవుకు, గోస్పాడు, జూపాడుబంగ్లా, రాచర్ల, పాములపాడు పోలీసుస్టేషన్ల పరిధిలో కార్డన్ సర్చ్ చేపట్టామన్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడినట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తాలుకా సీఐ ఈశ్వరయ్య, పలు స్టేషన్ల అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రానున్న నాలుగు రోజులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుఫాను కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. కాలువలు, వాగులు, వంకలు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా కల్వర్టులు కూలడం వంటివి జరిగితే సాధ్య మైనంత వేగంగా పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

నిండుకుండలా శ్రీశైల జలాశయం

శ్రీశైలం అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. జలాశయానికి వరద పెరుగుతూ ఉంది. ఆదివారం జూరాల ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 22,512 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 62,059 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 2876 క్యూసెక్కుల నీరు విడుదలయ్యాయి. సాయంత్రానికి జలాశయానికి 68,921 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 27,000, 35315 క్యూసెక్కులు, మొత్తంగా 62,315 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 195.66 టీఎంసీలుగా నమోదైంది.

నేడు ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

శ్రీశైలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ధర్మకర్తల మండలి సభ్యుల్లో సోమవారం ముగ్గురు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు జరిగే ప్రమాణ స్వీకారంలో గంగమ్మ, భరద్వాజశర్మ, ఆకుల శ్రీనివాసులు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. సాయంత్రం సున్నిపెంటలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి మరికొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేయనున్నారు.

బస్సులో రూ.25 లక్షలు చోరీ!

- సికింద్రాబాదు- బెంగుళూరు ప్రయాణంలో అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఘటన
- కర్నూలులో నిందితులను పట్టుకున్న పోలీసులు
- తెల్లవారుజామున హైడ్రామా



నిందితుల (వైట్ టీషర్ట్, రెడ్ షర్ట్)తో పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నుంచి బెంగుళూరు వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద రూ.25లక్షలు చోరీ జరిగిన సంఘటన ఆదివారం జిల్లాలో చోటు చేసుకుంది. చోరీ జరిగిన రెండు గంటల్లోనే పోలీసులకు డబ్బును రికవరీ చేయగలిగారు. ఈ ఉదంతం జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున కలకలం సృష్టించింది. తెల్లవారుజామున 3నుంచి 6 గంటల వరకు సుమారు 100 మందికి పైగా పోలీసులు డోన్ జాతీయ రహదారిని జల్లెడపట్టి కేవలం 2గంటల్లోనే కేసు ఛేదించి సూపర్ అనిపించుకున్నారు. రాజస్థాన్ సిరాయ్ జిల్లాకు చెందిన రావల్ అనే వ్యక్తి గోల్డ్ బిజినెస్ చేస్తుంటాడు. బెంగుళూరులో వెండి బిస్కెట్లు కొనేందుకు రూ.25లక్షలతో సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడే గుత్తికి చెందిన ధర్మవరం డిపో బస్సును ఎక్కాడు. గుత్తికి వెళ్లి అక్కడి నుంచి గుంతకల్లు చేరుకుని మిత్రుడితో కలసి బెంగుళూరు వెళ్లి వెండి బిస్కెట్లు కొనుగోలు చేయాలని భావించాడు. కర్నూలులో తన సీటు కింద బ్యాగ్ చెక్ చేసుకుంటే.. ఆ బ్యాగ్ సురక్షితంగా ఉంది. వెల్దుర్తి మండలం అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఓ ఇద్దరు యువకులు సడెన్‌గా బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరారు. సికింద్రాబాదు నుంచి అనంతపురం బస్సు టికెట్ తీసుకున్న ఆ ఇద్దరూ మధ్యలోనే దిగడం డ్రైవర్‌ను ఆశ్చర్యపరిచింది. టోల్‌ప్లాజా వద్ద బస్సు ఆపేసి వారిని దింపేశాడు. తీరా టోల్‌ప్లాజా దాటుతుండగా.. సికింద్రాబాదులో బస్సు ఎక్కేటప్పుడు ఖాళీ చేతులతో బస్సు ఎక్కారు. ఇక్కడేమో ఓ బ్యాగుతో బస్సు దిగారనే అనుమానం వచ్చిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. అందరిని నిద్రలేపి ఎవరి బ్యాగ్ అయినా పోయిందా అని చూసుకోవాలని కోరారు. అప్పటికి నిద్ర మత్తులో ఉన్న రావల్ తన సీటు కింద ఉన్న బ్యాగ్ మాయమైనట్లుగా గుర్తించి షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిగతా 7వ పేజీలో

నింగిలో వెండి మబ్బులు



చాగలమర్రి మండల కేంద్రంలో నీలి మేఘాలు ఆదివారం ఆకట్టుకున్నాయి. సూర్యోదయం సమయంలో ఎత్తైన మేఘాలపై వెండి మబ్బులు చూపరులను కట్టిపడేశాయి. రోజంతా వివిధ ఆకారాల్లో దర్శనమిచ్చాయి. ప్రకృతి గీసిన చిత్రంలా తలపించిన ఈమేఘాలు ఆకాశంలో వెండిమబ్బులు ఆవిష్కృతమై చూపరులను కనువిందు చేశాయి.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

జలసోయగం



ప్రకృతిని ఆస్వాదించాలంటే పచ్చని చెట్లు.. కనువిందు జలపాతాలు.. నల్లమలలోని వృక్ష, జంతు సంపదను చూడాల్సిందే. ఆ ప్రకృతిని చూస్తే ప్రతి ఒక్కరూ ఆహ్లాదాన్ని పొందాల్సిందే. అలాంటిదే అవుకు మండలంలోని మంగంపేటతండా సమీపంలోని జలపాతం. ఎడతెరిపి లేని వర్షాలతో కొండల నుంచి వర్షపు నీరు సెలయేర్ల ద్వార ప్రవహిస్తూ ఎత్తయిన కొండల నుంచి జాలువారుతోంది. ఈ మనోహర దృశ్యం ప్రతి ఒక్కరినీ మంత్ర ముగ్దుల్ని చేస్తోంది. జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుం టోంది. మంగంపేట నుంచి జలపాతం వద్దకు చేరుకోవాలంటే మూడు కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. వర్షానికి ఈరహదారి భారీగా కోతలకు గురై గుంతలమయంగా మారింది. అయినప్పటికీ పర్యాటకులు అతి కష్టం మీద జలపాతం వద్దకు చేరుకొని ప్రకృతి సోయగాన్ని తనవి తీరా ఆస్వాదిస్తున్నారు.

● అవుకు, ఆంధ్రజ్యోతి

ప్రైవేటు ట్రావెల్స్‌పై వేశారు..!

- 6 కేసులు నమోదు ● రూ.28,400 జరిమానాలు
- బస్సులవారీగా రికార్డుల పరిశీలన
- ఉలిక్కిపడ్డ ట్రావెల్స్ నిర్వాహకులు



తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

ఓ దుర్ఘటన అధికారుల్లో చలనాన్ని తీసుకొచ్చింది. నిద్రమత్తును ఇన్నాళ్లకు వీడారు. ఎట్టకేలకు ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. రవాణా శాఖ ఆదేశాల మేరకు దాడులు ముమ్మరం చేశారు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా మీదుగా వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. ఒకవైపు నిబంధనలు పాటించని బస్సులపై కేసులు.. జరిమానాల రూపంలో కొరడా ఝుళిపించడంతో ఆయా ట్రావెల్స్‌కు చెందిన బస్సుల రికార్డులను పక్కాగా పరిశీలిస్తుండటం గమనార్హం. నిబంధనలు అతిక్రమించి తిరిగే బస్సులపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 కేసులు నమోదు చేశారు. నంద్యాల జిల్లాలో 6 కేసులు నమోదు చేసి రూ. 28,400 జరిమానాలు విధించారు.

నంద్యాల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు బస్సు దుర్ఘటన నేపథ్యంలో జిల్లా రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులపై విస్తృత దాడులు చేపట్టారు. 6 కేసులు నమోదు చేసి రూ.28,400 జరిమానాలు విధించారు. ఒక్కసారిగా అధికారులు ప్రైవేట్ బస్సులపై ఆకస్మిక దాడులు చేయడంతో ఆయా నిర్వాహకుల్లో అలజడి మొదలైంది. రవాణా శాఖ కమిషనర్ మనీ‌ష్‌కుమార్ సిన్హా రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి నేతృత్వంలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా మీదుగా వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రికార్డులు, బస్సుల్లో తగిన భద్రత, అగ్నిమాపక, సీటింగ్ అంశాలవారీగా పరిశీలించారు.

ప్రయాణికులకు అవగాహన

బస్సులో ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అత్యవసర ద్వారాల నుంచి సురక్షితంగా బయటపడే అంశాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. డ్రైవర్లుకు సైతం డ్రైవింగ్ నిబంధనలు పక్కాగా పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 కేసులు

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు అతిక్రమించి తిప్పుతున్న బస్సులపై 361 కేసులు నమోదుచేసి 40బస్సులను సీజ్‌చేశారు. రూ.లక్షల్లో జరిమానాలు విధించారు. కర్నూలు జిల్లాలో 14 కేసులు నమోదుచేసి రూ. 72,050, నంద్యాల జిల్లాలో 6 కేసులు నమోదు చేసి రూ. 28,400 జరిమానా విధించారు.

ఉన్నతాధికారుల ప్రత్యేక దృష్టి

భవిష్యత్తులో కర్నూలు తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఆశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఏయే బస్సులు ఏరాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ పొందిన తిప్పుతున్నారు? లోకల్ ఎన్ని.. నాన్‌లోకల్ ఎన్ని..? ఇలా పలు అంశాలు వారీగా రవాణా శాఖ అధికారులు ఆరాతీస్తున్నారు. దీంతో ఆయా నిర్వాహకుల్లో కొంత ఉలికిపాటు మొదలైంది. ఈక్రమంలో తమకు భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చి పడుతోందనని ఆందోళన నెలకొంది.

రికార్డులను పక్కాగా పరిశీలిస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు, జరిమానాలు విధిసున్నాం. బస్సుల రికార్డులను పక్కాగా పరిశీలించి నివేదిక తయారు చేస్తున్నాం. ● జి.వి శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల



శరవేగంగా..

5వ పేజీ తరువాయి

డీఎన్ఏ పరీక్షలకు టాప్ ప్రయారిటీ

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు డీఎన్ఏ పరీక్షలు ఎంతో కీలకమైనవి. సాధారణంగా డీఎన్ఏ శాంపిల్స్ పరీక్షలు చేసి నివేదికలు రావడానికి 48 గంటలు లేదా మూడు రోజులు పడుతుంది. ప్రభుత్వం కలెక్టర్, ఎస్పీ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఈ పరీక్షలకు టాప్ ప్రియారిటీ ఇచ్చారు. ఆదివారం సెలవు అయినా కూడా పని చేసి 18 మంది మృతదేహాలు, తర్వాత మరో మృతదేహం డీఎన్ఏ పరీక్షలు 24 గంటలలోపు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం కలెక్టర్, ఎస్పీ, జేసీ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, కర్నూలు ఆర్‌డీవో మార్చురీకి చేరుకుని పర్యవేక్షించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించే ప్రక్రియ ప్రారంభించారు.

17 అంబులెన్సులతో తరలింపు

బస్సు అగ్ని ప్రమాదంలో మరణించిన

ఫోరెన్సిక్ ప్రొఫెసర్ ఉదయం నుంచే..

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ విభాగంలో ఆదివారం ఉదయం 8 గంటలకే ఫోరెన్సిక్ విభాగపు ప్రొఫెసర్ డా.బ్రహ్మాజీ మాస్టర్ చేరుకుని ప్రక్రియను ప్రారంభించారు. మార్చురీలోని వాకింగ్ కోల్డ్‌రూంలో భద్రపరిచిన 19మృతదేహాలను డా.బ్రహ్మాజీ హాస్పిటల్ డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా ఒక్కొక్కటి భద్రపరిచి బంధువులకు అప్పగించారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి వరకు చాలా వేగంగా పనిచేశారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా మృతదేహాలను తరలించారు.





మార్చురీ సమీపంలో హెల్ప్ డెస్క్ ఎదుట మృతుల కుటుంబీకులు

ఇతర రాష్ట్రాల మృతదేహాల కోసం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అంబులెన్సులను తెప్పించారు. కలెక్టర్ సహకారంతో తెలంగాణ నుంచి 9అంబులెన్సులు, కర్నూలు జీజీహెచ్ నుంచి 8 ప్రైవేటు అంబులెన్సులు, 5 మహాప్రస్థానం వాహనాలను రెండు రోజులుగా సిద్ధం చేశారు. మృతదేహాల తరలింపు ఏ మాత్రం ఆలస్యం కాకుండా తరలించారు.



కోల్డ్ స్టోరేజీ రూంలో మృతదేహాల అప్పగింత ప్రక్రియలో పాల్గొన్న డా.బ్రహ్మాజీ మాస్టర్





మార్చురీ సమీపంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



నేడు కర్నూలులోనే అంత్యక్రియలు?

బస్సు అగ్ని ప్రమాదంలో మరణించిన మృతదేహాల తరలింపు ఆదివారం రాత్రి 8.45 గంటల వరకు కొనసాగింది. 19మృతదేహాల్లో 18 మృతదేహాలను బంధువులకు అప్పగించి వారి స్వస్థలాలకు పంపించారు. ఇక తమిళనాడుకు చెందిన 29 ఏళ్ల ప్రశాంత్ మృతదేహం ఇక్కడే ఉంది. సోమవారం కర్నూలులోనే అంత్యక్రియలు చేస్తామని బంధువులు చెప్పినట్లు తెలిసింది.



మార్చురీ వద్ద మృతదేహాల తరలింపులో పాల్గొన్న అధికారులు

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన తెలంగాణకు చెందిన ఆరు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చెక్‌ను ఆప్రభుత్వం తరుపున గద్వాల జిల్లా ఆర్‌డీవో అలివేలు పంపిణీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌లోని మార్చురీ వద్ద మృతదేహాల అప్పగింత తర్వాత చెక్‌ను అందించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన ఆదిశేషగిరిరావు, ఒరిస్సాకు చెందిన దీపక్, చింతల్ హైదరాబాదుకు చెందిన చందన, సంధ్యారాణి, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన మేఘనాథ్, యాదాద్రి జిల్లా వాస్సకోడూరు చెందిన మహేశ్వరం అనుషా కుటుంబాలకు చెక్కులు ఇచ్చారు.



బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

హత్యాయత్నం కేసులో 9మందికి రిమాండ్

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్ఞానపురానికి చెందిన సుబ్బరాయుడిపై హత్యాయత్నం చేసిన కేసులో ఆదివారం 9మందిని రిమాండుకు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ సురేశ్ తెలిపారు. వివరాలు.. రెండు రోజుల కిందట సుబ్బరాయుడిని గుల్లిబాష, మరో ఎనిమిది మంది కలిసి దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

వచ్చేనెల 1నుంచి ఏకాంకిక నాటక పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా నవంబరు 1 నుంచి 7 వరకు ఏకాంకిక నాటక పోటీలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు కళారత్న పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 'కర్నూలు ఉత్సవ్'కు ఉమ్మడి జిల్లా నుంచి 40 పౌరాణిక ఏకాంకిక నాటకాలు పోటీకి వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం 120 మంది కళాకారులు వారం రోజుల పాటూ ప్రదర్శనలు ఇస్తారని వివరించారు. ఉదయం 10 గంటల నుంచీ సాయంత్రం 6గంటల వరకు ఏకాంకిక నాటక పోటీలు, సాయంత్రం 6.30 గంటల నుంచి శాస్త్రీయ, జానపద, పల్లె నృత్యాలు, శాస్త్రీయ, జానపద, పల్లె పాటలు, సంగీత విభావరులు, ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. 'కర్నూలు ఉత్సవ్-2025' కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నమోదుకు అంగీకరించిందని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం మూడో సారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లోకి నమోదు కాబోతోందని వారు పేర్కొన్నారు.

బస్సులో రూ.25 లక్షలు చోరీ!

(5వ పేజీ తరువాయి)

ప్రయాణికుడు, డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అప్పటికే కావేరి బస్సు ప్రమాదంపై విచారణలో భాగంగా జాతీయ రహదారిపై పోలీసు గస్తి పెంచారు. వీరిద్దరు ఇచ్చిన సమాచారంతోఅప్పటికే హైవే పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. మరో పక్క జిల్లా పోలీస్ బాస్‌కు సమాచారం రావడంతో ఎలాగైనా ఈ కేసును వెంటనే ఛేదించాలని ఆదేశించారు. అటు డోన్ వైపు.. ఇటు కర్నూలు వైపు జాతీయ రహదారిలో ఉన్న అన్ని పాయింట్ల వద్ద గస్తి ముమ్మరం చేశారు. కర్నూలులో నైట్ పెట్రోలింగ్‌లో ఉన్న కోడుమూరు సీఐ తబ్రేజ్ తన సిబ్బందితో కలిసి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మిస్టర్ ఇడ్లీ హోటల్ వద్ద తనిఖీలు చేపట్టారు. ధర్మవరం ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆ ఇద్దరు యువకులు బ్యాగ్‌తో ఎర్రబస్సులో ఎక్కారనీ సమాచారం ఇవ్వడంతో ఆ ఎర్రబస్సునే కాకుండా దారిలో వచ్చిన ప్రతివాహనాన్ని తనిఖీలు చేశారు. లారీలు, కార్లు, మోటారు సైకిళ్లు ఏదీ వదలిపెట్టలేదు. నాలుగున్నర గంటల నుంచి 6:30 గంటల వరకు సుమారు 200 పైగా వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కర్నూలు వైపు వచ్చిన వాహనాల డ్రైవర్లను ఆరా తీశారు. ఎవరైనా ఇద్దరు యువకులు అమకతాడు టోల్ ప్లాజా వద్ద బస్సు ఆపేందుకు ప్రయత్నించారా? అని ఆరా తీశారు. ఓ ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేస్తుండగా.. డ్రైవర్‌ను అడిగారు. మా బస్సులో ఇద్దరు ఎక్కారంటూ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో వెంటనే అప్రమత్తమైన సీఐ తబ్రేజ్ ముందుగా ఓ ఇద్దరు కానిస్టేబుళ్లను బస్సులోకి పంపాడు. పోలీసుల రాకతో ఆ యువకులు నగదును బయట పడేస్తారేమోనన్న ఉద్దేశంతో డోర్ లాక్ చేసి తాను కిందనే ఉన్నాడు. కానిస్టేబుల్ రాకను గమనించిన ఆ యువకులకు చెమటలు పట్టాయి. ఆ యువకుల వద్ద రూ.25 లక్షల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నగదు మొత్తాన్ని సరి చూసుకుని వెల్దుర్తి పోలీసులకు కేసు అప్పగించారు.



రూ.25 లక్షలను పరిశీలిస్తున్న పోలీసులు

● ఆ ఇద్దరు ఎవరు?

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమద్ షాహీద్, సాహేబ్‌గా పోలీసులు గుర్తించారు. వీరిపై గతంలో ఆ రాష్ట్రంలో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. సికింద్రాబాదు నుంచే వ్యాపారి రావల్‌ను ఫాలో అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. రావల్ వద్ద రూ.25 లక్షలు ఉన్న విషయాన్ని ఆ ఇద్దరు యువకులకు ఎవరు చేరవేశారో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొంత మంది మార్వాడి వ్యాపారులు తమ తోటి మార్వాడి వ్యాపారులను బిజినెస్‌ను దెబ్బతీసేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కొంత మంది యువకులను ఎంచుకుంటుంటారనీ పోలీసులు చెబుతున్నారు. అలా ఎవరైనా బిజినెస్ పని మీద దూర ప్రాంతాలకు వెళ్తున్న వారిని పసిగట్టి ఇలాంటి వారికి సమాచారం ఇస్తుంటారనీ సమాచారం. ఆ ఇద్దరు యువకులకు ఎవరు సమాచారం ఇస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కేవలం 2 గంటల్లోనే పోలీసులు కేసు ఛేదించి దొంగలను పట్టుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

తల్లి మందలించిందని.. ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

బేతంచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని కోటపేటలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. కోటపేటలో నివాసం ఉంటున్న షేక్ నూర్జహాన్ రెండో కుమారుడు హుసేన్‌వలి వ్యసనాలకు బానిసయ్యాడు. శనివారం రాత్రి తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పైభాగంలో ఉన్న ఓ గదిలోకి నిద్ర పోయేందుకని వెళ్లాడు. అక్కడ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లి వెళ్లి చూడగా కుమారుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా మారాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోవెలకుంట్లలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్పృహ తప్పి పడిపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కోవెలకుంట్లలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని బిజినేముల గ్రామానికి చెందిన దస్తగిరి(30) అనే వ్యక్తి ఆదివారం ఉదయం కోవెలకుంట్లకు వచ్చాడు. సుమారు 11.30 గంటల సమయంలో పట్టణంలోని సుస్మిత ఫర్టిలైజర్స్ షాపు వద్ద ఉన్నట్లుండి స్పృహ తప్పి పడిపోయి మరణించాడు. మృతుడి తల్లి తల్లి నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

సంజామల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆల్వకొండలో ఇటీవల జరిగిన గొడవల్లో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ రమణయ్య తెలిపారు. వివరాలు.. ఈనెల 20న ఆల్వకొండకి చెందిన ఎగ్గోని శ్రీనాథ్ తన స్నేహితుడైన మంగలి సుబ్బయ్యను ఎస్సీ కాలనీలో వదిలిపెట్టడానికి బైక్‌పై వస్తున్నాడు. పేరం శ్రీనివాసరెడ్డి తన ఇంటి ముందు సీసీ రోడ్డుపై సుబ్బయ్య, శ్రీనాథ్‌ను ఆపి కులం పేరుతో నానా దుర్భషలాడాడు. ఇలా ఎందుకు దూషిస్తారని ప్రశ్నించిన శ్రీనాథ్‌ను శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు మరోసారి దుర్భషలాడి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆత్మకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి రెహ్మాన్‌ఖాన్ యూత్ గేమ్స్ నేషనల్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పేల్ మున్నా తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో క్రీడాకారుడిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో గోవాలో జరిగే నేషనల్ పోటీల్లో క్రీడాకారుడు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నూర్‌బేగ్, అలీహుసేన్ ఉన్నారు.

వన్య ప్రాణులను వేటాడితే చర్యలు

మహానంది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలోని ఇళ్లలో సోదాలు నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ వన్యప్రాణుల వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నాగేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణా ప్రతాప్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

● రూ.1.30లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టూటౌన్ పరిధిలో జూదరులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ సురేశ్ ఆదివారం తెలిపారు. వివరాలిలా.. శ్రీనివాసనగర్ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఆరుగురిని పట్టుకుని రూ.1.30 లక్షల నగదు, ఆరుసెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు స్పందన కరువు

- ముగిసిన దరఖాస్తుల గడువు
- నందికొట్కూరులో 29 అక్రమ లేఅవుట్లు
- 1500 ప్లాట్లకు గాను కేవలం 42 మాత్రమే దరఖాస్తులు
- అధికారులు, పాలకుల ఊహలు తలకిందులు

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నందికొట్కూరులో వేసిన అక్రమ లేఅవుట్లపై కూటమి ప్రభుత్వం రాగానే కొరడా ఝుళిపించింది. భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఆపేశారు. దీంతో పట్టణంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ ఫీజులు, పన్నుల రూపేణా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్‌ను తీసుకువచ్చి, భారీగా ఆదాయం సమకూర్చుకోవాలని భావించింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రాంతాల పరిధిలో కుడా చైర్మన్ పట్టణంలో ఎల్ఆర్ఎస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రయోజనాలు తెలియజేశారు. అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకోకపోతే భవిష్యత్తులో కలిగే ఇబ్బందులను వివరించారు.

భారీ అంచనాలు

నందికొట్కూరు మున్సిపల్ పరిధిలో 23 అక్రమ లేఅవుట్లలో దాదాపు 1500 ప్లాట్లు వెలిశాయి. వీటిని క్రమబద్ధీకరించడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చని భావించింది. ఆగస్టు నుంచి అక్టోబరు 23వ రకు దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఇచ్చింది. 90 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే 7శాతం, ఆ తర్వాత 14శాతం ఫీజులు చెల్లిస్తే ఆ ప్లాట్లు క్రమబద్ధీకరించుకో వచ్చు. దీంతో పట్టణంలో ఉన్న 1,500 ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేస్తే దాదాపు రూ.6 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో మున్సిపల్ ఆర్థిక కష్టాలు తీరడమేగాక అక్రమ లేఅవుట్ల సమస్య పరిష్కారమై రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని భావించారు. కానీ 90రోజు వ్యవధిలో కేవలం 42 ప్లాట్లకు మాత్రమే దరఖాస్తు వచ్చాయి. అంటే రూ.4.2 లక్షల ఆదాయం మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.


నందికొట్కూరు పురపాలక కార్యాలయం

క్షేత్రస్థాయిలో కానరాని స్పందన

ఎల్ఆర్ఎస్ ద్వారా భారీగా ఆదాయం చేకూరుతోందని అధికారులు, పాలకులు అంచనాలు వేశారు. కానీ, క్షేత్రస్థాయిలో స్పందన కనిపించలేదు. ఒక్కో ప్లాటు క్రమబద్ధీకరణకు మొదట రూ.10వేలు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ఆ తర్వాత మరో 14 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా మొత్తం కలిపితే ఒక్కో ప్లాట్‌కు సుమారు రూ. 40 వేలు ఖర్చుపెట్టాల్సి ఉండటంతో యజమానులు శ్రద్ధ చూపడం లేదు. మళ్లీ ధరలు వచ్చి అమ్ముకోవాలనే ఉద్దేశంతో కొనుగోలు చేసినవారు ఎక్కువగా ఉండటంతో వారు ఎల్ఆర్ఎస్‌పై ఆసక్తి చూపడం లేదు. మరికొందరైతే ఈ స్కీం ఇలాగే కొనసాగుతుందనే నమ్మకంతో ఉన్నారు. త్వరలో ఇల్లు కట్టుకునే వారు మాత్రమే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు.

42 దరఖాస్తులు వచ్చాయి



ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువు అక్టోబరు 23కు ముగిసింది. అవగాహన కల్పించాం. కాని ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. దీంతో నందికొట్కూరు మున్సిపాలిటీలో 42 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ఇంకా గడువు పెంచే అవకాశం ఉంది. ప్లాట్ల యజమానులు వినియోగించుకోవాలి.

● రంగస్వామి,
టౌన్ ప్లానింగ్ అధికారి, నందికొట్కూరు


రైతులు ఆరబెట్టిన తడిసిన ధాన్యం

భయపెడుతున్న మొంథా..

● పొలాల్లోనే మొక్కజొన్న దిగుబడులు
● ఆవేదనలో అన్నదాతలు

ఆత్మకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం ప్రభావంతో రాష్ట్రానికి ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ దెబ్బకు ఆత్మకూరు ప్రాంత రైతాంగం భయపడిపోతున్నారు. ప్రత్యేకించి మొక్కజొన్న సాగుచేసిన రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవస్థ పడుతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది తొలకరి వర్షాలు సకాలంలో కురియడంతో ఆత్మకూరు వ్యవసాయ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 18,457 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. ఇందులో ఆత్మకూరు మండలంలో 4289 పాములపాడులో 7015, కొత్తపల్లిలో 6008, వెలుగోడు మండలంలో 1145 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగైంది. అయితే పంటకాలం సమయంలో అడపాదడపా వర్షాలు కురిసినప్పటికీ దిగుబడులు వచ్చాక నెలల తరబడి వర్షాలు వదలడం లేదు. దీంతో పంట పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయి కనీసం పంటకోతలు కోసేందుకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. దిగుబడులు చేతికి రాక రైతులు పడుతున్న కష్టాలు అవర్ణాతీతం. సెప్టెంబరు నెలలోనే మొక్కజొన్న పంట కోతలు జరగాల్సి ఉన్నప్పటికీ అక్టోబరు చివరి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. తాజాగా మొంథా తుఫాన్ రానుండటంతో రైతుల పరిస్థితి దిక్కుతోచని స్థితిలో మారింది. ఇప్పటివరకే పంటపొలంలోని దిగుబడులు దెబ్బతినడంతో గిట్టుబాటు ధరలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. అలాగే పలు పంటపొలాల్లో ధాన్యం మొలకెత్తిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో తుఫాన్ వస్తుండటంతో దిగుబడి మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా అక్కడక్కడ పంటకోతలు జరిపిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. తడిచిన ధాన్యానికి మద్దతు ధరలు లేక కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో నష్టాలను చవిచూసిన రైతులకు మొంథా తుఫాన్ మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దారు

పాణ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుపై అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావం అధికంగా ఉండడంతో గ్రామాల్లో ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూం మండల కేంద్రంలో ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతినెల పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు నంద్యాల ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా తెలిపారు. నవంబరు 4న నంద్యాల నుంచి అరుణాలచం వెళ్లే భక్తులు ఎవరైనా ఉంటే ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే పంచారామాల క్షేత్రదర్శిని కార్యక్రమంతో ఐదు ప్రముఖ శైవ క్షేత్రాలైన అమరారామం, సోమేశ్వర రామం, క్షీరారామం, భీమేశ్వర రామం, కొరమరారామం వంటి క్షేత్రాలకు నవంబరు 1, 4, 7, 8, 15వ తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం తెలిపారు.

గ్రామాల్లో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఐ నరేంద్ర


పాములపాడు ఎస్సీ కాలనీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సురేశ్‌బాబు

పాములపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన పాములపాడులో ఎస్ఐ సురేశ్‌బాబు పోలీసులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని పది మోటారు సైకిళ్లను, 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పోలీస్‌లు సోదాలు నిర్వహించారు. గ్రామంలో అనుమానితులు, బెల్ట్‌షాప్ నిర్వాహకుల ఇళ్లలో తనిఖీలు చేశారు. వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో జూపాడుబంగ్లా ఎస్ఐ మల్లికార్జున, ఏఎస్ఐ శేషయ్య , సిబ్బంది ఉన్నారు.

వెండి సామగ్రి వితరణ

పాణ్యం, అక్టోబరు26 : (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు వెండి సామగ్రి వితరణ చేశారు. ఆదివారం బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన దేరెడ్డి నాగిరెడ్డి, దేరెడ్డి నాగమునీశ్వరరెడ్డి వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం రూ. 5 లక్షల విలువైన 3.244కిలోల వెండి బిందె, పల్లెం, చెంబును ఈవో రామకృష్ణకు అందజేశారు. భక్తులను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాణ్యం శిక్షణా సబ్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పగిడ్యాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వైసీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, వైసీపీ నాయకులు ఉస్మాన్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం లక్ష్మాపురం గ్రామంలో రైతులు కల్లాలలో ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాలను ప్రభుత్వం సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారుల చేతిలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పగిడ్యాల సర్పంచ్ శేషన్న, వైసీపీ నాయకులు మద్దిలేటి, నాగశేనారెడ్డి తదితరులున్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా ఆదివారం తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో 22మంది మైనర్లు పట్టుబడినట్లు సీఐ తెలిపారు. వీరి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది భక్తుల సేవలో వైద్య సిబ్బంది

మహానంది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా స్వామివారి దర్శనం కోసం మహానందికి వచ్చే భక్తులకు తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శిబిరం ఏర్పాటు చేశారు. అవసరమైన భక్తులకు మాత్రలు పంపిణీ చేశారు. ఉసేన్‌రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంద న్నారు. ఆలయం ముందు భాగంలోని సుపథ మంటపంలో భక్తులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం

మహానంది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు రామలింగారెడ్డి పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్‌గా రమేష్‌తో పాటు మరో ఎనిమిది మంది సభ్యుల చేత దేవదాయశాఖ అధికారులు ప్రమాణాస్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి పాలకమండలి కృషి చేయాలని రామలింగారెడ్డి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, మారెడ్డి సుబ్రమణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

● ఒకరి దుర్మరణం.. 12మందికి గాయాలు

పాణ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన తమ్మరాజుపల్లె సమీపంలో ఆదివారం చోటు చేసుకన్నది. పోలీసుల వివరాల ప్రకారం..కార్తీక మాసం సందర్భంగా మిడ్తూరు మండలానికి చెందిన పలువురు ఆటోలో కొత్తూరు దేవస్థానానికి వచ్చారు. స్వామివారి పూజలనంతరం తిరిగి వెళ్తుండగా తమ్మరాజుపల్లె సమీపంలోని రాజస్థాన్ డాబా వద్ద కర్నూలు వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. వీపనగండ్ల గ్రామానికి చెందిన బోయ సరస్వతి (55) అక్కడికక్కడే మృతి చెందగా 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమించిన వారిని కర్నూలు జనరల్ ఆసుపత్రికి, మరికొందరిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే నూలు మిల్లు సమీపంలో కారు టైరు పగిలి అవతలి వైపున్న రోడ్డులో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో పులివెందులకు చెందిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వక్కిలేరు వంతెన సమస్యను పరిష్కరించాలి


కలుగొట్లపల్లె వక్కిలేరు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల సమీపంలో గల వక్కిలేరు వంతెన సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్థులు వక్కిలేరు వాగు వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. గత 5 రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలతో వక్కిలేరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు చేసేందుకు వీలు లేకుండా పోయిందని వాపోయారు. లోతట్టు వంతెనలు కావడంతో వరద వచ్చినప్పుడల్లా రాకపోకలు చేసేందుకు వీలు లేకుండా పోతోందని విద్యార్థులు, రైతులు, కూలీలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పందించి వంతెన సమస్య పరిష్కరించేలా చూడాలని కోరారు.

30న వెంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలోగల వెంకటేశ్వరస్వామి ఆలయంలో 30న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులచే వేద పండితుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో దంపతులచే కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

రుద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఈ నెల 29న ఎన్టీఆర్ పథకంకింద నిర్మాణం చేపట్టిన గృహాల ప్రవేశం ఉంటుందని హౌసింగ్ డీఈ అజయ్‌బాబు అన్నారు. రుద్రవరంలో ప్రారంభోత్సవానికి ఎంపిక చేసిన గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుద్రవరంలో ఆరు గృహాలు, ఆళ్లగడ్డలో 2, చాగలమర్రిలో 5 ఎంపిక చేశామన్నారు. డీఈ మాట్లాడుతూ రుద్రవరం మండలంలో 975గృహాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించామన్నారు. ఎన్టీఆర్‌గృహ పథకం కింద అదనంగా ఎస్సీ ఎస్టీ బీసీలకు 50వేలు మంజూరు చేశామన్నారు. అలాగే మండలానికి 1743 గృహాలు వివిధ పథకాల కింద మంజూరు కాగా వీటిలో 905 గృహాలు పూర్తి కాగా, 835 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్స్‌పెక్టర్లు ఆనంద్, ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటరు రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణస్వామి ఆదివారం వెల్లడించారు. అంకిరెడ్డిపల్లె వద్ద 132కెవి విద్యుత్‌లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10గంటల నుంచిచి, సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

వచ్చేనెల 1న కార్తీక వన భోజనం

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుండం ఆంజనేయస్వామి సన్నిధిలో నవంబరు-1 మండల గౌడ్స్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండయ్యగౌడు ఆదివారం వెల్లడించారు. ఈకార్యక్రమానికి గౌడ్స్ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని, సుమారు 6000మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

నేటి నుంచి సీపీఐ శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గుహల ఆవరణలో సోమవారం నుంచి సీపీఐ జిల్లా స్థాయి సైద్ధాంతిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాట్లను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, వినయ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 27, 28, 29 మూడు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మాన్యం ఉన్నా..
అభివృద్ధి శూన్యం

- శిథిలావస్థలో ప్రాచీన చెన్నకేశవస్వామి ఆలయం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భక్తులు

ప్యాపిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రాచీన చెన్నకేశవస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వందల ఎకరాల మాన్యం ఉన్నా.. ఆలయ అభివృద్ధి గురించి దేవదాయశాఖ పట్టించుకోకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శ్రీకృష్ణదేవరాయలు కాలంనాటి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఉంది. పూర్వం ఈ ఆలయంలో నిత్య దూప, దీపంతో పాటు ఉగాది, దసరా పర్వదినాల్లో ఎంతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. అయితే దశాబ్దాలుగా ఆలయంలో ఈ వైభవాలు కనబడటం లేదు. కనీసం నిత్య దూప, దీపం కూడా కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఎంతో వైభవంగా విరాజిల్లిన ఆలయం ఈ దుర్భరస్థితికి రావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భయం నీడలో భక్తులు పూజలు

శతాబ్దాల క్రింత నిర్మించిన ఆలయంలో స్తంభాలు పూర్తిగా విరిగిపోయాయి. ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. దీంతో భక్తులు భయం నీడలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పరిస్థితిని పలుమార్లు సంబంధిత దేవాదాయశాఖ అధికారులు పరశీలించిన ఫలితం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.


ప్యాపిలిలోని చెన్నకేశవస్వామి ఆలయం


ఆలయంలో దెబ్బతిన్న పైకప్పు దూలాలు

మాన్యం నిధులు దుర్వినియోగం..

లక్ష్మి, చెన్నకేశవస్వామి ఆలయంకు దాదాపు 300ఎకరాల మాన్యం ఉంది. ఈ మాన్యంను సక్రమంగా నిర్వహిస్తే ఆలయానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం ఉంటుంది. ఈ మాన్యంను పలువురు పంచుకొని దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాగే దేవాదాయశాఖ అధికారులు చుట్టపు చూపుగా ఏదోరోజు వస్తారే కాని ఆలయం గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు

మద్యంబాటిళ్ల చెక్ చేసి తీసుకోండి

కోవెలకుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ ద్వారా మద్యం బాటిళ్లను చెక్ చేసుకుని తీసుకువెళ్లాలని కోవెలకుంట్ల ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ సందీప్‌యాదవ్ అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల ఎక్సైంజ్ పరిధిలని మద్యం షాపులకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను అతికించి ప్రజలకు అందించి అవగాహన కల్పించారు. మద్యం షాపుల నిర్వాహకులు కూడా మద్యం షాపుల్లో నకిలీ బాటళ్లను విక్రయించకూడదన్నారు. రుజువైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానిస్టేబుళ్లు హనుమంతు, లక్ష్మిరెడ్డి, సుబ్బయ్య, రమేశ్ పాల్గొన్నారు.

అర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని ఉయ్యలవాడ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న హోంగార్డు శ్రీరాములు అనారోగ్యంతో నంద్యాలలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని వచ్చాడు. ఆదివారం డిఎస్పీ ప్రమోద్, పోలీసు సిబ్బంది తమ వంతుగా హోంగార్డు కుటుంబ సభ్యులకు రూ 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బందికి ఏదైనా అపద వస్తే తాను ఉన్ననని ఆళ్లగడ్డ డీఎస్పీ అండగా ఉంటారని పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుంశింగవరం గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వెనుక పేకాట స్థావరంపై దాడి నిర్వహించి, ఆరు మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. వీరి వద్ద నుంచి రూ.13,100 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.25వేలు విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి ఆదివారం దాతలు ఆలయాభివృద్ధికి రూ25వేలు విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీపీ.కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. అనంతపురం జిల్లా కొడిమి గ్రామానికి చెందిన మధుసూదన్‌రావు, జయమ్మ వారి కుటుంబ సభ్యులు అందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు


ఆలయ అభివృద్ధికి చెక్కును అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ భీమలింగేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి నంద్యాలకు చెందిన రామగోపాల్, రమాదేవి దంపతులు రూ.45 వేలు, కామనూరుకు చెందిన లక్ష్మీరెడ్డి రూ.20 వేలు చెక్కులను ఆలయ అధ్యక్షుడు నారాయణరెడ్డికి అందజేశారు. దాతలను ఆలయ అర్చకులు సన్మానించారు.

ఉపాధ్యాయులతోనే పిల్లల భవిష్యత్తు


ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతోనే పిల్లల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ రఘునాథ్, యుటీఎఫ్ పూర్వ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరసింహుడు, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్బరాయుడు, జన విజ్ఞాన వేదిక నాయకులు మాణిక్యంశెట్టి పాల్గొన్నారు.

28న రక్తదాన శిబిరం

డోన్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీన జరగాల్సిన రక్తదాన శిబిరం కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మృతులకు సంతాపంగా వాయిదా వేయడం జరిగింది. తిరిగి 28వ తేదీ మంగళవారం డోన్ రైల్వేస్టేషన్ రోడ్డులోని క్లబ్ హౌస్‌లో మహా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా తుఫాను వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి వీఆర్వోలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఆటోల ద్వారా మైకుల్లో అనౌన్స్ చేయించినట్లు తెలిపారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు


గుడిపాడులో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్యాపిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా గ్రామంలోని పలువురి అనుమానితులు ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ప్రజలు కలసి మెలసి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని కొండమనాయునిపల్లెలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశామన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించి నాటుసారాతో కలిగే నష్టాలను వివరించామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించామన్నారు.

ప్రశాంత జీవితాన్ని కొనసాగించాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐలు

బేతంచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు, ప్రజలతో కలిసి మెలిసి ప్రశాంత జీవితాన్ని కొనసాగించాలని బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆయా గ్రామాల రౌడీ షీటర్లకు సీఐ వెంకటేశ్వరరావు కౌన్సిలింగ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది, ఆయా గ్రామాల రౌడీషీటర్లు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

డోన్ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపరాదని అర్బన్ ఎస్ఐ జగన్నాథం నాయక్ సూచించారు. ఆదివారం పట్టణంలోని కంబలపాడు సర్కిల్‌లో వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే.. జరిమానా తప్పదని అన్నారు. డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ కార్తీక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


డోన్‌లో వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం


కార్యకర్తకు బహుమతిని అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీసీ కుటుంబానికి అండగా నిలిచి, ఆదరిస్తున్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని మంత్రి బీసీ జనార్దన రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవరాజుపల్లె గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆమె కార్యకర్తలతో మాట్లాడారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో కొలిమిగుండ్ల సొసైటీ చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి, సీనియర్ నాయకుడు ఇటిక్యాల బాలిరెడ్డి, సాయినాథరెడ్డి, చంద్రశేఖర్, కంబయ్య పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లెలో దర్గా ప్రారంభం


దర్గాను ప్రారంభిస్తున్న పీఠాధిపతి హజరత్ ఆల్‌హజ్ మహ్మద్‌మియా

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని పాత ఖాదీ కార్యాలయం సమీపంలో కొత్త ఖాన్ కాయే అలియా నియాజియా దర్గాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఖాద్రీ చిష్తి పీఠాధిపతి హజరత్ ఆల్‌హజ్ మహ్మద్ మియా ఆదివారం ప్రారంభించారు. ఆస్థాన రోడ్డు నుంచి పాతబస్టాండు మీదుగా ర్యాలీ నిర్వహించారు. దర్గాను ప్రారంభించి పీఠాధిపతి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు నియాజ్ హుసేన్, ముస్లింలు పాల్గొన్నారు.

రాయల్టీ చెక్‌పోస్టులు ఎత్తివేయాలి



ర్యాలీ చేస్తున్న నాయకులు

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ నాయకులు బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. పెంచిన రాయల్టీ జీవోలను వెంటనే రద్దు చేయాలని, మైనింగ్ పరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యలయం ఎదుట సీపీఐ, సీఐటీయూ కార్యకర్తలు ర్యాలీగా బయలు దేరి పెట్రోల్‌బంకు సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ రోజుకు గతంలో రూ.650 వసూలు చేస్తుండగా ప్రస్తుతం ఓ ప్రైవేటు సంస్థకు రాయల్టీ వసూలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ట్రాక్టర్‌కు రూ.2250లు వసూలు చేస్తున్నారన్నారు. పభుత్వం జోక్యం చేసుకొని నాపరాయి రాయల్టీలను తగ్గించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, సంజీవులు, శివబాలకృష్ణ, భార్గర్, మహేశ్, నాగాంజనేయులు కుళ్ళాయిస్వామి, సుబ్బయ్య, ఖాదర్, ట్రాక్టర్, గని యజమానులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

బేతంచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం బేతంచెర్ల మండల కమిటీ అధ్యక్షులుగా మద్దిలేటి స్వామిని మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుల ఎస్.నాగేశ్వరరావు, సి.శ్రీనివాసులు, నాగేంద్ర ప్రసాద్, నాగరాజు, మద్దయ్య, నాగేంద్ర రెడ్డి, నాగమద్దయ్య పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి


ఇంటి పత్రాలను చూపుతున్న బాధితులు

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలోగల కొత్త కొట్టాల కాలనీలో గత 20ఏళ్ల క్రితం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నామని, అయితే ఈ స్థలం మాదంటూ ఓ వ్యక్తి నోటీసులు ఇచ్చారని కాలనీకి చెందిన 40 మంది బాధితులు ఆదివారం వాపోయారు. కాలనీకి చెందిన జిలాన్‌బాషా, రామయ్య, పెద్దపాప, షేక్షావలితో పాటు మరి కొందరికి అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్‌రెడ్డి కోర్టు నుంచి నోటీసులు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2005లో కొత్త కొట్టాల కాలనీలో 141 సర్వే నంబర్‌లో 40 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. 2024లో 141-1 సర్వే నంబర్‌లో 60 సెంట్లు కొనుగోలు చేశారు. అయితే స్థలాన్ని అమ్మిన వారి కుటుంబీకులైన వెంకటేశ్వర్ రెడ్డి, అతడి భార్య లక్ష్మీదేవి పేరుమీద ముత్తూట్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకున్నారు. బాధితులు కొనుగోలు చేసుకున్న స్థలాలు తమవేనంటూ నోటీసులు ఇచ్చారు. అమ్మిన స్థలంలో రహదారి ఇచ్చేందుకు బాధితుల నుంచి రూ.3.5 లక్షలు వసూలు చేశారు. బాధితులకు అమ్మిన స్థలం తిరిగి ఆ స్థలం మాదే అంటూ కోర్టులో కేసు వేశారని బాధితులు వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మరమ్మతులు వేగవంతం చేయండి


టీజీపీ కాలువ గండి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న భూమా జగత్

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామంలో 84 కి.మీ వద్ద టీజీపీ ప్రధాన కాలువకు గండిపడ్డ విషయాన్ని తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం రాత్రి గండి ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గండి మరమ్మతు పనులు వేగవంతం చేయిస్తామని అన్నారు. రెండు రోజుల్లో పనులు చేయించి కాలువకు నీరు వదిలేలా చూస్తామని అన్నారు. సంబంధిత అధికారులతో గండిపడ్డ విషయం గురించి చర్చించారు. మోంత తుఫాన్ పట్ల ఆయా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆయా ఆయన వెంట టీడీపీ నాయకులు రమణారెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గోపాల్, సురేష్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

పసుపు పంటపై గడ్డిమందు పిచికారి

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలో లక్ష్మీరెడ్డి అనే రైతు సాగు చేసిన పసుపు పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందుతో పిచికారి చేసిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పంట చేతికొచ్చే సమయంలో గడ్డిమందుతో పిచికారి చేసి పంట నాశనం చేశారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు నీరందించే డ్రిప్‌లో కూడా గడ్డిమందు వేసేందుకు డ్రిప్ పరికరాలను పగలగొట్టారు. పచ్చగా ఉన్న పసుపు పంటపై గడ్డిమందు పిచికారి చేయడంతో ఎర్రగా మారి రైతుకు నష్టం వాటిల్లింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. రైతు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తలూరు సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.